క్లుప్తంగా

అవార్డు ప్రదానం



షేక్‌మున్నాను అవార్డుతో సన్మానిస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్ : రంజాన్ మాసం పురస్కరించుకుని గత 18 సంవత్సరాలుగా ఉదయం సేహ్రి కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహిస్తున్న షేక్ మున్నాకు రంజాన్ సేవా రత్న అవార్డును ప్రకటించారు. కడప మేకలదొడ్డి వద్ద ఉన్న జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పటాన్ ఖాదర్‌బాష, అన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్‌చాంద్‌బాష ఆధ్వర్యంలో ఆయనకు అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉదయం సేహ్రి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లి మైనార్టీ నాయకులు షేక్ అమనుల్లా, షేక్ అమీన్ అబ్దుల్లా అలీ తదితరులు పాల్గొన్నారు.

సెక్టోరియల్ ఆఫీసర్స్‌గా అర్హులను నియమించాలి



సమగ్రశిక్ష ఏపీసీకి వినతిపత్రం సమర్పిస్తున్న హెచ్‌ఎం సంఘం నాయకులు

కడప ఎడ్యుకేషన్ : సమగ్రశిక్షలో సెక్టోరియల్ ఆఫీసర్స్‌గా అర్హత కలిగినటువంటి, పని చేయడానికి ఆసక్తి ఉన్నటువంటి హెచ్‌ఎం, ఎంఈఓలను నియమించడానికి చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్‌రావులు డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం సమగ్రశిక్ష ఏపీసీ నిత్యానందరాజును తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర జిల్లాల్లో ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులే సమగ్రశిక్షలో సెక్టోరియల్ ఆఫీసర్స్‌గా కొనసాగుతున్నారన్నారు. కానీ ఈ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్స్‌ను నియమించేందుకు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సంఘం ట్రెజరర్ విజయ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం పెంచుకునేందుకు దోహదం



సైన్సుఫెయిర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా సైన్సు అధికారి ఎబినేజర్

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పెంచుకునేందుకు సైన్సుఫెయిర్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని జిల్లా సైన్సు అధికారి ఎబినేజర్ ఇమ్మానుయేలు పేర్కొన్నారు. కడప రవీంద్రనగర్‌లో ఉన్న అస్సాలిహాత్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో శనివారం సైన్సుఫేర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎస్‌ఓ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు మేధాశక్తి పెంచుకోవడానికి సైన్సుఫెయిర్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ముక్తార్ అహ్మద్, శ్రీ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి, డీపీసీ కన్వీనర్ బాబుభాయ్, హెచ్‌ఎం మునీర్ అహ్మద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు

చింతకొమ్మదిన్నె : బుగ్గలపల్లె సమీపంలోని బుగ్గ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయం కమిటీ సభ్యులు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గుడా ప్రభాకరరెడ్డి తెలిపా రు. బుధవారం భక్తులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదే రోజు బండలాగుడు పోటీలు నిర్వహిస్తారన్నారు. మొదటి బహుమతిగా రూ.40వేలు కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ సభ్యుడు నరేన్ రామాంజనేయరెడ్డి అందిస్తారన్నారు. రెండో బహుమతి రూ. 30 వేలు, మూడవ బహుమతిగా రూ.20 వేలు, నాలుగో బహుమతిగా రూ.15వేలు, ఐదవ బహుమతిగా రూ.10 వేలు అందిస్తామని తెలిపారు.

రైతులకు అందుబాటులో గోడౌన్

చింతకొమ్మదిన్నె : బుగ్గలపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌను నిర్మించామని రైతులు తమ పంట దిగుబడులను నిలువ చేసుకోవాలని నాగిరెడ్డిపల్లి పీఏసీఎస్ సీఈవో రవిశంకరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు గోడౌను ఉపయోగించుకోని పక్షంలో ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు ఈ గోడౌన్‌ను బాడుగకు ఇస్తుందన్నారు.

29 మందికి ప్లేస్‌మెంట్

కమలాపురం : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల లో నిర్వహించిన ఇంటర్వ్యూలో జిల్లాలోని వివిధ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 29 మందికి ప్లేస్ మెంట్ లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

భక్తవ శంకర.. శంభో హర హర

నేడు నగరంలో మహాదేవుని శోభాయాత్ర



కడప కల్చరల్ : ఒకటిన్నర నెల నుంచి పంచనది సంగమమైన గంగానదిలో మహా కుంభమేళా అత్యంత ఘనంగా జరుగుతోంది. 444 ఏళ్లకు ఒకసారి జరిగే ఈ ఉత్సవానికి వీలైనంత మంది వెళ్లి.. అద్భుతమైన ఘట్టంలో పాల్గొన్న తృప్తి పొందారు. ఇంకా ఎంతో మందికి అక్కడికి వెళ్లి గంగలో స్నానం చేయాలన్న కోరిక ఉంటుంది. అలాంటి వారి కోసం అక్కడి నుంచి పెద్ద ఎత్తున గంగా జలాన్ని తెప్పించి నగర వాసులు, కడప నగరాన్ని సంప్రోక్షించనున్నామని మహాదేవుని శోభాయాత్ర నిర్వాహకులు విజయానంద్ తెలిపారు.

శనివారం 'సాక్షి'తో ఆయన మాట్లాడుతూ కడప నగరంలోని మృత్యుంజయకుంట శివాలయం నుంచి ఆదివారం ఉదయం 7.30 గంటలకు మహాదేవుని నగర శోభాయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ఆలయంలో అభిషేకం తదితర పూజల నంతరం 116 మంది అర్చకుల ఆధ్వర్యంలో వేద మంత్రపఠనంతో యాత్ర ప్రారంభమవుతుందన్నారు. నగరంలోని ముఖ్య కూడళ్ల మీదుగా ఈ యాత్ర సాగుతుందన్నారు. హిందూ బంధువులతో పాటు గంగా జలాన్ని పవిత్రంగా భావించే వారంతా ఈ యాత్రలో పాల్గొంటారని తెలిపారు. యాత్రలో పెద్ద ఎత్తున భక్తజనం పాల్గొంటారని, గంగిరెద్దులు, గోమాతలు, గుర్రాలు కూడా ఉంటాయని, బాలల శాస్త్రీయ నృత్యాలు, స్త్రీ పురుషుల కోలాట ప్రదర్శనలు కూడా ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం ఆలయం వద్ద అల్పాహారం అనంతరం శోభాయాత్ర ప్రారంభమవుతుందని, మధ్యలో పలుచోట్ల అల్పాహారం, మంచినీటి సౌకర్యం ఉంటుందని, మధ్యాహ్నం భోజన వసతి కూడా ఉంటుందని, రాత్రి 8.30 గంటల తర్వాత యాత్ర తిరిగి ఆలయానికి చేరుతుందని, ముగింపు సందర్భంగా అక్కడ భోజన వసతి కల్పిస్తారన్నారు. యాత్రలో భాగంగా కుంభమేళా నుంచి సేకరించిన పవిత్ర పంచనదీ జలాలను కలశాలతో అక్కడికి వెళ్లలేని నగరవాసులను సంప్రోక్షిస్తామని, నగరంలో ముఖ్యమైన చోట్ల కూడా సంప్రోక్షణ నిర్వహిస్తామన్నారు.

యాత్ర సాగేదెలా..

కడప నగరంలోని మృత్యుంజకుంట శివాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్, రాజీవ్‌మార్గ్, ఎర్రముక్కపల్లె, సంధ్య సర్కిల్, ఐటీఐ, కాగితాలపెంట, కోటిరెడ్డిసర్కిల్, నాగరాజుపేట, పాత బస్టాండు, ఏడురోడ్లు, వన్‌టౌన్, కృష్ణా సర్కిల్, అన్నమయ్య సర్కిల్, అప్సర సర్కిల్, ఎన్జీఓ కాలనీ మీదుగా శివాలయానికి చేరుతుంది.

అబుల్ కలాం ఆజాద్ జీవితం ఆదర్శనీయం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం ఆదర్శనీయమని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఇందిరాభవన్‌లో భారత మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అఫ్జల్‌ఖాన్ మాట్లాడుతూ ఆజాద్ స్వదేశీ (స్వరాజ్యం) ఉత్పత్తులను ప్రోత్సహించడం, భారతదేశానికి స్వరాజ్ (స్వరాజ్యం) లక్ష్యాన్ని ప్రోత్సహించడం వంటి గాంధీ ఆదర్శాలకు తనను తాను అంకితం చేసుకున్నారన్నారు. 1923లో 35 ఏళ్ల వయసులో ఆయన భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేసిన అతి పిన్న వయస్కుడన్నారు. 1920 అక్టోబర్‌లో బ్రిటీష్ వలస ప్రభుత్వం నుంచి సహాయం తీసుకోకుండానే ఉత్తరప్రదేశ్‌లోని అలీఘర్‌లో జామియా మిలియా ఇస్లామియాను స్థాపించడానికి ఫౌండేషన్ కమిటీ సభ్యుడిగా ఆజాద్ ఎన్నికయ్యారన్నారు. 1934లో విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని అలీఘర్ నుంచి న్యూఢిల్లీకి మార్చడంలో ఆయన సహాయం చేశారన్నారు. విశ్వవిద్యాలయం ప్రధాన ప్రాంగణానికి ప్రధాన ద్వారం (గేట్ నంబర్ 7) ఆయన పేరు మీద పెట్టబడిందన్నారు. 1931లో ధరసన సత్యాగ్రహం ప్రధాన నిర్వాహకులలో ఆజాద్ ఒకరు అని, అలాగే ఆ కాలంలో అత్యంత ముఖ్యమైన జాతీయ నాయకులలో ఒకరిగా ఎదిగారన్నారు. హిందూ-ముస్లిం ఐక్యతకు కృషి చేశారని, లౌకికవాదం, సోషలిజాన్ని సమర్థించారన్నారు. 1940 నుంచి 1945 వరకు ఆయన కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ బండి జకరయ్య, సీనియర్ నాయకులు సత్తార్, సిరాజుద్దీన్ విజయ భాస్కర్, నగర డివిజన్ ఇన్‌చార్జిలు హమీద్ ఆబిద్, కమాల్, ఆసిఫ్ ఖాన్, ప్రసాద్, మహిళా నాయకురాలు సంధ్య తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మౌలానా అబుల్ కలాం జీవితం ఆదర్శం

కడప ఎడ్యుకేషన్ : భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ నేటి యువతకు ఆదర్శమని యువత అబుల్ కలాం ఆజాద్ అడుగుజాడల్లో ప్రయాణించాలని నగరపాలక ఉర్దూ మెయిన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి అన్నారు. శనివారం రాయల్ రషీద్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడప నగరపాలక సంస్థ ఉర్దూ మెయిన్ పాఠశాల నందు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 68వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి మాట్లాడుతూ భారతదేశానికి స్వా తంత్రం అనంతరం తన మేధావితనంతో ఈరోజు వరకు ఎంతో ప్రతిష్టాత్మకంగా పిలవబడుతున్న ఐఐటీలు ఆ రోజే అబ్దుల్ కలాం ఆజాద్ బీజం వేశారన్నారు. అలాంటి మహానుభావులును నేటితరం యువత ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని అన్నారు.

ఆజాద్ అడుగుజాడల్లో నడవాలి

కడప ఎడ్యుకేషన్ : మౌలానా అబుల్ కలాం ఆజాద్ అడుగుజాడల్లో నేటి యువత ప్రయాణించాలని నగరపాలక ఉర్దూ మెయిన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి అన్నారు. రాయల్ రషీద్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడప నగరపాలక సంస్థ ఉర్దూ మెయిన్ పాఠశాలలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయల్ రషీద్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరిముల్లా, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాయల్ రషీద్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరిముల్లా, ఎస్టియు జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ భాష ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలల పని వేళలు మార్పు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : దేశవ్యాప్తంగా మార్చి 2వ తేదీ నుంచి రంజాన్ మాసం ప్రారంభం కానుందని, ఈ నేపథ్యంలో ఉర్దూ పాఠశాలల పనివేళలు మార్పు చేయాలని ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్(ఐటా) రాష్ట్ర మాజీ అధ్యక్షులు అబ్దుల్ రజాక్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నజీర్‌బాష, అబ్బాస్‌అలీలు కోరారు. శనివారం కడప ఐటా కార్యాలయంలో సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ మాసం పురస్కరించుకుని ఉర్దూ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఉపవాసాలు పాటిస్తారన్నారు. వీరి సౌలభ్యం కోసం ఉర్దూ పాఠశాలలు, ఉర్దూ పార లెల్ సెక్షన్ పాఠశాలలను ఒంటి పూట నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. కావున ఉర్దూ పాఠశాలల పని వేళల్లో మార్పు చేసి వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. అలాగే రాష్ట్ర విద్యాశాఖ తెలుగు కాంప్లెక్స్, ఉర్దూ స్కూల్ కాంప్లెక్స్ స్థానంలో ఉమ్మడి క్లస్టర్లను ప్రవేశ పెట్టిందని, ఈ ఉమ్మడి క్లస్టర్‌లను ఏ ఉద్దేశంతో అయితే ప్రవేశపెట్టారో ఆ ఉద్దేశం నెరవేరడం లేదన్నారు. కావున క్లస్టర్లను కూడా మీడియంల వారీగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటా నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటా జిల్లా అధ్యక్షుడు నజీర్‌బాషా

బాధ్యతాయుత పౌరులుగా ఎదిగేందుకు ఉపయుక్తం

కడప ఎడ్యుకేషన్ : స్కౌట్ ఉద్యమంలో ఉన్న వారు నైతిక విలువలతో కూడిన బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దబడతారని డీఈఓ, స్కౌట్ జిల్లా చీఫ్ కమిషనర్ డాక్టర్ షేక్ షంషుద్దీన్ పేర్కొన్నారు. శనివారం ప్రపంచ ఆలోచనా దినోత్సవం, స్కౌట్ వ్యవస్థాపకులు బడెన్‌పావెల్ ఆయన సతీమణి లేడీ బడెన్‌పావెల్ జన్మదినాన్ని పురస్కరించుకుని కడప శంకరాపురంలోని స్కౌట్ జిల్లా కార్యాలయంలో జరుగుతున్న బేసిక్ స్కౌట్ మాస్టర్, గైడ్ కెప్టెన్ శిక్షణా శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ బడెన్‌పావెల్ విగ్రహానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషులు మంచి ఆలోచనలతో చేసే పనులు శాశ్వతంగా ఉంటాయన్నారు. దీనికి చక్కటి ఉదాహరణ బడెన్‌పావెల్ లేనన్నారు. ఇప్పుడు ఉన్న సమాజ పరిస్థితుల దృష్ట్యా స్కౌట్ ఉద్యమంలో ఉన్న వారు నైతిక విలువలతో కూడిన బాధ్యతాయుత పౌరులుగా తీర్చబడతారన్నారు. స్కౌట్ ఉద్యమంలో చేరి తద్వారా రిజర్వేషన్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ ఎల్‌ఓసి వెంకటేశ్వర్లు, సిబ్బంది ఓబయ్య, పవన్‌కుమార్, గైడ్ కెప్టెన్ ఎల్ఓసీఏ సుగుణారాజేందర్, బీవీ సుబ్బులక్ష్మి, సిబ్బంది చంద్రావతి, ప్రశాంతి, విగ్రహదాత సీనియర్ స్కౌట్ మాస్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఎస్ఎసి లక్ష్మీర్‌తోపాటు స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ డాక్టర్ షేక్ షంషుద్దీన్

ఆకట్టుకున్న బొమ్మల పెళ్లి



వివాహ వేడుకలో నూతన వధూవరులు



స్టెప్ సీఈఓ సాయిగ్రేస్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ : పెళ్లంటే.. అందరికీ సంబరమే.. పలు వర్గాల్లో ఉత్సాహం, ఆనందం తొణికిసలాడుతాయి. కొత్త బట్టలు ధరించి సంతోషంగా పెళ్లి పందిట్లో హడావుడి చేస్తారు. శనివారం ఆ అవకాశం నగర వాసుల్లో కొందరికి లభించింది. కానీ అది బొమ్మల పెళ్లి. నగరానికి చెందిన ఓ వస్త్ర దుకాణం శ్రీరస్తు.. శుభమస్తు అంటూ బొమ్మల పెళ్లిని ఏర్పాటు చేసింది. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన బొమ్మల కొలువులో మంగళస్నానం నుంచి వివాహ విందు వరకు 21 ఘట్టాలను కనువిందుగా తీర్చిదిద్దారు. ముచ్చటగా ముద్దులొలుకుతున్న బొమ్మలకు కల్యాణంలో వాడే సంప్రదాయ వస్త్రాలను ధరింపజేసి వివాహంలోని ముఖ్యమైన సంప్రదాయాలన్నింటినీ కళ్లకు కట్టినట్లు ఏర్పాటు చేశారు. ఈ ఘట్టాలు నగర వాసులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా స్టెప్ సీఈఓ సాయి గ్రేస్ హాజరై బొమ్మల కొలువును ప్రారంభించారు. సంస్కృతి సంప్రదాయాలకు, స్వదేశీ వారసత్వ వస్త్రాలను ప్రచారం చేసేందుకు సంస్థ చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ తమసంస్థ వారసత్వ రక్షణ కోసం పని చేస్తోందని, క్రమంగా కనుమరుగవుతున్న వివాహ సంప్రదాయాలను కాపాడుకునేందుకు చేస్తున్న కృషిని తమ సంస్థ ప్రోత్సహిస్తోందని తెలిపారు. వినూత్నమైన శైలిలో సంప్రదాయ దుస్తులు ధరించాలన్న ప్రచారం చేయడం గొప్ప విషయమన్నారు. సంస్థ మేనేజర్ నిహారిక, సింధూర స్టెప్ సీఈఓకు, వెంకట రమణ, శిరీష్‌లు ఇంటాక్ చిన్నపరెడ్డికి ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జమ్మలమడుగు రూరల్ : మార్చి 8వ తేదిన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.భార్గవి తెలిపారు. శనివారం సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులతో, న్యాయవాదులతో లోక్ అదాలత్‌పై ఆమె సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. చిన్న చిన్న కేసులతో సంవత్సరాల తరబడి స్టేషన్, కోర్టుల చుట్టూ తిరగకుండా కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ అయ్యే విధంగా చూడాలని అధికారులకు సూచించారు.

వికలాంగ బాలబాలికలకు చికిత్స

చింతకొమ్మదిన్నె : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదు లు శివకేశవ, స్వచ్ఛంద న్యాయ సేవకులు సు రేష్ శ్యాం మండలంలో అంగవైకల్యంతో బాధపడుతున్న బాలబాలికలకు వివరాలను సేక రించి కడప రిమ్స్ ఆవరణలోని ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌కు రెఫర్ చేశారు. బాల బాలికలు ఏదైనా శారీరక లేదా మానసిక అంగవైకల్యంతో బాధపడుతున్నట్లైతే వారికి చికిత్స అందించడంకోసం ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ నందు చిన్నపిల్లల వైద్యులు, స్పీచ్ థెరపిస్ట్, ఫీజియోథెరపిస్ట్, ఆడియోలజిస్ట్, కౌన్సిలర్ అందుబా టులో ఉంటారన్నారు. ఇందుకోసం ప్రజలు 15100 ఫోన్ నెంబర్ వుపయోగించి తమసంస్థ సేవలు పొందవచ్చని తెలిపారు.

గండి క్షేత్రంలో నిత్యాన్నదానానికి విరాళం

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి క్షే త్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానికి శనివా రం ప్రొద్దుటూరుకు చెందిన మలిశెట్టి కొండన్న తన భార్య రామ సుబ్బమ్మ జ్ఞాపకార్థం రూ. 50,116లు విరాళం ఇచ్చారు. ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, ధర్మకర్తల మండలి సభ్యులు దాత కొండన్న కుటుంబ సభ్యులకు తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వెంకటసుబ్బయ్య, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

వల్లూరు (చెన్నూరు) : ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీ కడప కలెక్టరేట్ కార్యాలయం ఎదుట చేసే ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.మేరీ పిలుపునిచ్చారు. చెన్నూరులో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని అలాగే ప్రతి పిల్లవాడికి రూ.30 పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వంట ఏజెన్సీ కార్మికులందరూ పాల్గొనాలని ఆమె కోరారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుపోవడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన ఎస్.బసవరాజు తెలిపారు. 25 ఏళ్లుగా వైఎస్ కుటుంబం వెంట ఉంటూ నమ్మకంగా సేవలందించినందుకు రాష్ట్ర బీసీ కార్యవర్గంలో చోటు కల్పించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు రమేష్ యాదవ్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు ధన్యవాదాలు తెలిపారు.

పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : తల్లిదండ్రులు తమ చిన్నారులకు సకాలంలో టీకాలు ఇప్పించి వివిధ వ్యాధుల బారిన పడకుండా సంరక్షించాలని హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత సూచించారు. శనివారం నాగరాజుపేటలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ప్రసన్నలత చిన్నారులకు ఇస్తున్న వ్యాక్సిన్ ,డ్యూలిస్ట్, స్కూల్ హెల్త్ కార్యక్రమం, అసంక్రమిత వ్యాధుల సర్వే గురించి ఆరా తీశారు. చిన్నారుల రికార్డులు, ఆన్‌లైన్ రిపోర్టులు తనిఖీ చేసి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తప్పక తమ బిడ్డలకు డ్యూ డేట్ ప్రకారం వ్యాధినిరోధక టీకాలు ఇప్పించినట్లయితే 13 ప్రాణాంతక వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. వైద్య సిబ్బంది సూచనలు పాటిస్తే బిడ్డకు వ్యాధి నిరోధకత పెరుగుదలతోపాటు ఎలాంటి అంటు వ్యాధులకు గురికాకుండా ఆరోగ్యంగా ఉంచవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుబ్బరాయుడు, ట్రైనీ డాక్టర్స్ డాక్టర్ నీరజ రెడ్డి, డాక్టర్ వెంకట సాయి మేఘన, డాక్టర్ శర్వారి, ఏఎన్‌ఎం లక్ష్మీ దేవి, లలిత ఆశాలు పాల్గొన్నారు.



చిన్నారికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

చట్టాలపై అవగాహన అవసరం

కడప ఎడ్యుకేషన్ : నేటి పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రత్యూషకుమారి పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు శనివారం కడప రామాంజనేయపురంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ(నల్సా) న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసెస్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల సంరక్షణ కోసం స్నేహ పూర్వక న్యాయ సేవల పథకం, లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్- 1987, స్పెషల్ జోనల్ పోలీస్ యూనిట్, బాలల, కౌమార లేబర్ చట్టం 1986, బాలల హక్కుల పరిరక్షణ చట్టం -2005 తదితరాలపై వివరించారు. అలాగే లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, దివ్యాంగజన్ హెల్ప్‌లైన్ నెంబర్ 14456, 1930 నెంబర్ల గురించి అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, డిస్ట్రిక్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంట్, రూరల్ అండ్ ఎన్విరాన్మెంటల్ డెవలప్‌మెంట్, వన్ స్టాఫ్ సెంటర్ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎన్‌జీవోలు, లెక్చరర్లు, పారా లీగల్ వలంటరీలు, పానెల్ న్యాయవాదులు స్టాల్స్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ డాక్టర్ షేక్ షంషుద్దీన్, డిస్ట్రిక్ జైల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ బిఆర్ సుభాష్‌యాదవ్, వన్‌స్టాఫ్ సెంటర్ సబ్ ఇన్‌స్పెక్టర్ శాంత, ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సీఎచ్ జ్యోతి, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంతా, డెటాల్ బనేగా సంస్థ ఇండియా ప్రాజెక్టు సార్ప్, ఎన్‌జీవో నాయకులు రవికుమార్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి సెక్రటరీ ప్రత్యూషకుమారి

సీనియారిటీ జాబితాలోని తప్పులు సవరించండి

కడప ఎడ్యుకేషన్ : టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం(టిస్) సమాచారం ఆధారంగా కడప డీఈఓ కార్యాలయం విడుదల చేసిన ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలోని తప్పులను సవరించాలని ఎస్టీయూ ఏపీ కడప జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాషా, సంగమేశ్వర్‌రెడ్డిలు డీఈఓ షంషుద్దీన్‌ను కోరారు. శనివారం సాయంత్రం కడప కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన సమన్వయ సమావేశంలో వారు మాట్లాడారు. టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఆధారంగా ఉపాధ్యాయుల వివరాలు సక్రమంగా నమోదైనప్పటికీ కొన్ని సాంకేతిక కారణాలతో సీనియార్టీ జాబితాలో తప్పులు చోటుచేసుకున్నాయని అన్నారు. ఈ జాబితా ఆధారంగా పదోన్నతులు చేపడితే అర్హులైన ఉపాధ్యాయులకు నష్టం జరుగుతుందన్నారు. కాబట్టి నిర్ణీత కాలంలో జాబితాను సవరించాలని కోరారు. అలాగే గతంలో 117 జీవో ద్వారా ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలకు విలీనం చేశారని, ప్రస్తుతం పాఠశాలల పునర్ నిర్మాణ ప్రక్రియలో భాగంగా 3,4,5 తరగతుల విద్యార్థులను సంబంధిత ప్రాథమిక పాఠశాలలకు విలీనం చేసి 60 మంది విద్యార్థుల కంటే ఎక్కువగా ఉన్న పాఠశాలలను మోడల్ ప్రైమరీగా ప్రకటించాలని కోరారు. 2008 హామీ పత్రాల ఉపాధ్యాయులకు అందరికీ ఏకరీతిగా ఒకే జాయినింగ్ డేట్‌ను నిర్ణయించాలని కోరారు. అంతర్ జిల్లా బదిలీలలో 610 జీవో ద్వారా వచ్చిన వారికి సర్వీస్ ప్రొటెక్షన్ కల్పించి సీనియార్టీ జాబితాలు సవరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

విద్యాభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో ఉన్న ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులు, సంఘ నాయకులందరూ కలిసికట్టుగా పని చేసి విద్యాభివృద్ధికి కృషి చేద్దామని డీఈఓ డాక్టర్ షేక్ షంషుద్దీన్ తెలిపారు. శనివారం సాయంత్రం కడప డీఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఉపాధ్యాయ సంఘ నాయకులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఉన్న సమస్యలను నేరుగా తన దృష్టికి తేవాలన్నారు. పాఠశాలల్లో ఉన్న సమస్యలను కూడా తెలియజేయాలన్నారు. అలాగే పదవ తరగతికి సంబంధించి ఈ ఏడాది ఉత్తమ ఫలితాలను సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పలు ఉపాధ్యాయ సంఘ నాయకులు మాట్లాడుతూ టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టంలో ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాకు సంబంధించి కొన్ని తప్పులున్నాయని, వాటిని సవరించాలని కోరారు. అలాగే జీవో నెంబర్ 117కు సంబంధించిన సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. అంతర్ జిల్లాల బదిలీల ద్వారా వచ్చిన వారి సర్వీస్ ప్రొటెక్షన్ కల్పించాలన్నారు. వీటితోపాటు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వీటిన్నింటిని డీఈఓ నోట్ చేసి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. మళ్లీ నిర్వహించే సమన్వయ కమిటీ సమావేశం నాటికి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సమగ్రశిక్ష ఏపీసీ నిత్యానందరాజులు, డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్, డీసీఈబీ సెక్రటరీ విజయభాస్కర్‌రెడ్డి, డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్లతోపాటు పలు ఉపాధ్యాయ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ షేక్ షంషుద్దీన్

మైనర్ల డ్రైవింగ్‌పై తనిఖీలు



మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న కడప ట్రాఫిక్ సీఐ జావేద్

కడప అర్బన్ : కడప నగరంలో మైనర్ల డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్‌పై శనివారం తనిఖీలను ట్రాఫిక్ సీఐ డి.కే జావేద్ ఆధ్వర్యంలో విస్తృతంగా నిర్వహించారు. మైనర్‌గా ఉండి డ్రైవింగ్ చేస్తున్న విద్యార్థులను పోలీసులు గుర్తించారు. 16 మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు. ఎం.వి.ఐ చట్టం ద్వారా చర్యలను తీసుకుంటామనీ సీఐ జావేద్ హెచ్చరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మైనర్లకు తల్లిదండ్రులు బైక్ ఇచ్చేముందు ఆలోచించాలన్నారు. ఇటీవలి కాలంలో మైనర్ డ్రైవింగ్ వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. స్కూల్ యాజమాన్యాలు, ఇతర విద్యాసంస్థలు మైనర్ డ్రైవింగ్‌పై విద్యార్థుల్లో అవగాహన కల్పించాలన్నారు.

